క్లుప్తంగా

'బీసీల డిమాండ్‌లను అసెంబ్లీలో లేవనెత్తాలి'



లక్ష్మయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీల డిమాండ్‌లపై రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తావనకు తీసుకొచ్చి బీసీల సమస్యలు పరిష్కరించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. మంచిర్యాలకు వచ్చిన మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టాలని, బీసీ ఫెడరేషన్లకు పాలక మండళ్లు ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలని, బీసీ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, కో కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, అఖిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఎస్‌డీఎల్‌సీఈ పీజీ పరీక్షల్లో గురువారం ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారని కాకతీయ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మల్లారెడ్డి తెలిపారు.

తిరుపతిలో యువ కవయిత్రికి సన్మానం



అక్షితను గజమాలతో సన్మానిస్తున్న ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాల చైర్మన్

చెన్నూర్: తిరుపతి పట్టణంలో ఈ నెల 9, 10 తేదీల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో చెన్నూర్ పట్టణానికి చెందిన మామిడి అక్షితను శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళావేదిక చైర్మన్ మాట్లాడుతూ.. యువ కవయిత్రి అక్షిత అతి చిన్న వయస్సులో సిరామృతం-1 పుస్తకాన్ని రాసి, ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. త్వరలోనే మరో పుస్తకం ముద్రిస్తుందన్నారు. కళావేదిక యువకవులు, కవయిత్రులను ప్రోత్సహిస్తుందన్నారు.

ఫిట్ కమిటీల పరిచయం

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్‌లో ఇటీవల నూతనంగా ఎన్నిక చేసిన ఫిట్ కమిటీలను గురువారం కంపెనీ అధికారులకు డివిజన్ నేతలు పరిచయం చేయించారు. ఆర్కే న్యూటెక్ గని ఫిట్ సెక్రెటరీగా ఎన్నికైన జంపన్నను ఆ గని మేనేజర్ స్వామిరాజుకు పరిచయం చేయించారు. ఎస్సార్పీ 1 గని అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా ఎన్నికైన అయిద తిరుపతిలను గని అధికారులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు పెట్టం లక్ష్మణ్, గడ్డం మహిపాల్‌రెడ్డి, కాశీరావు, రమేశ్, కానుగంటి చంద్రయ్య, రౌతు సత్యనారాయణ, లాగల శ్రీనివాస్, అన్వేశ్‌రెడ్డి, ఫిట్ సెక్రెటరీలు ఎంబడి తిరుపతి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగియనున్న దరఖాస్తుల గడువు

మంచిర్యాలటౌన్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకులాల ఆర్‌జేసీ/ఆర్‌డీసీ సెట్ గడువు ఈ నెల 16వ తేదీతో ముగుస్తుందని, 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ ఖాళీల అడ్మిషన్లకు ఈ నెల 20వ తేదీన గడువు ఉందని, గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌జేసీ/ఆర్‌డీసీ సెట్‌ను ఈ నెల 29వ తేదీన, బ్యాక్‌లాగ్ సీట్ల ఖాళీలకు గాను మే 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీపీ మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీసీలకు రిజర్వేషన్లు సాధించిన బిందేశ్వరీప్రసాద్ మండల్ వర్ధంతిని పురస్కరించుకుని బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ జాగృతి నాయకులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌ల కోసం బీపీ మండల్ కమిషన్ సిఫారసు చేసిన అంశాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి లక్ష్మణ్, తెలంగాణ బీసీ యువజాగృతి అధ్యక్షుడు మంచర్ల సదానందం, పట్టణ కార్యదర్శి వెన్నంపల్లి రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జక్కుల రాజు, బీసీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కూడళ్లు సరికొత్తగా..

- పట్టణ సుందరీకరణలో భాగంగా నాలుగు జంక్షన్ల ఆధునీకరణ
- నాలుగు జంక్షన్లకు రూ.4 కోట్లు
- పూర్తయితే మారనున్న పట్టణ రూపురేఖలు



లక్ష్మీ థియేటర్ చౌరస్తాలో జంక్షన్ నమూనా

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంగా మారిన మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని చౌరస్తాలను పట్టణ సుందరీకరణలో భాగంగా ఐబీ చౌరస్తా నుంచి లక్ష్మీ థియేటర్ చౌరస్తా వరకు ఉన్న నాలుగు చౌరస్తాలను ఆధునీకరించి, జంక్షన్లుగా మార్చేందుకు గాను రూ.4కోట్ల నిధులు కేటాయించారు. గతేడాదే పూర్తి కావాల్సిన పనులు ఆలస్యంగా ప్రారంభమైనా, పనులను వేగవంతంగా చేపడుతున్నారు. ఒక్కో జంక్షన్ ఆ చౌరస్తా ఏరియాను బట్టి డిజైన్‌ను రూపొందించారు. జంక్షన్లుగా మార్చడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దే పనులను చేపట్టడం వల్ల, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడంతో పాటు, ఆయా కూడళ్లలో పచ్చదనంతో కూడిన మొక్కలు నాటి, అందంగా తీర్చిదిద్దేలా పనులు చేస్తున్నారు. ఒక్కసారి నాలుగు జంక్షన్ల పనులను ప్రారంభించి, జంక్షన్ మధ్యలో తవ్వకాలను ప్రారంభించడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో పనులను వేగవంతంగా చేపట్టడంలో మాత్రం ఆలస్యం అవుతోంది. జిల్లా కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు మహారాష్ట్రతో పాటు, కుమురంభీం జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు మంచిర్యాలకు వస్తుంటారు. దీంతో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నాలుగు జంక్షన్ల అభివృద్ధి పనులను ఒకేసారి ప్రారంభించగా, అదే వేగవంతంగా ఒకేసారి పూర్తి చేసేలా పనులు చేపడితే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అవకాశం ఉంటుంది.

త్వరగా పూర్తిచేసేలా చర్యలు

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు చౌరస్తాలను అభివృద్ధి చేసేందుకు రూ.4కోట్ల నిధులు కేటాయించాం. ఇప్పటికే పనులు ప్రారంభించాం. ప్రతి చౌరస్తాలో రౌండ్‌గా నిర్మాణం చేసి, అందులోనే పచ్చదనం నింపేలా మొక్కలు నాటి, ఫౌంటేయిన్‌లు, పలు విగ్రహాలను ఏర్పాటు చేయనున్నాం. పనులను ఈ రెండు నెలల్లోపు పూర్తి చేయాలని నిర్ణయించాం. విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియతో పాటు, జంక్షన్ల నిర్మాణాన్ని ఒకేసారి చేపడుతున్నాం.

– మధుకర్, మున్సిపల్ ఇంజినీర్



ఐబీ చౌరస్తాలో చేపడుతున్న జంక్షన్ అభివృద్ధి పనులు

ఒక్కో జంక్షన్... ఒక్కో రీతిలో

పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పట్టణాలను సుందరీకరణగా మార్చడంతో పాటు, సుందరంగా మార్చేందుకు గాను పట్టణప్రగతి నిధులు కేటాయించారు. జిల్లా కేంద్రంలోని నాలుగు చౌరస్తాలకు కేటాయించిన రూ.4కోట్లతో ఒక్కో జంక్షన్‌ను ఒక్కో విధంగా తీర్చిదిద్దనున్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఇప్పటికే జంక్షన్‌ను ఏర్పాటు చేసి, అందులో పచ్చదనం ఉండేలా మొక్కలు నాటారు. ఫౌంటేయిన్ కూడా అందుబాటులో ఉంది. దీనిని మరింత పెద్దగా చేసి, అందులో పచ్చదనం పెంచేలా మొక్కలు నాటేలా చేస్తున్నారు. ఇందులో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఉంది. రెండోది టీటీడీ కల్యాణ మండపం చౌరస్తాలో ఫౌంటేన్‌తో కూడిన జంక్షన్‌ను, బెల్లంపల్లి చౌరస్తాలో గౌతమబుద్ధ శిల్పాలతో కూడిన జంక్షన్‌ను, లక్ష్మీ థియేటర్ చౌరస్తాలో నాలుగు గుర్రాలతో కూడిన జంక్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ సమస్య తీరేలా ఆయా జంక్షన్లను మారుస్తూ, పచ్చదనానికి ప్రాధాన్యం ఇచ్చేలా పనులు చేపట్టనున్నారు. ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు నాలుగు జంక్షన్లను ఐలాండ్ మాదిరిగా మారుస్తుండగా, జంక్షన్ల అభివృద్ధిని త్వరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



చెన్నూర్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి/చెన్నూర్/తాండూర్/భీమిని/నెన్నెల: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి గురువారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు, వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నేతలు పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో రాయడం వల్లనే నేడు దళితులు, అట్టడుగు వర్గాలు, ఇతర సామాజిక వర్గాల వారితో సమానంగా జీవించగలుగుతున్నారన్నారు. ఆ మహనీయుడిని తలచుకోవడం నిమ్నవర్గాల కనీస నైతిక బాధ్యత అని అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. చెన్నూర్‌లో ఎస్సీ జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్ పిలుపు మేరకు బీజేపీ నాయకులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు సమర్పించారు. బెల్లంపల్లిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పీక లక్ష్మణ్, చెన్నూర్‌లో ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్, బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్,తాండూర్‌లో దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి, కన్నెపల్లి, నెన్నెలలో బీజేపీ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి ఎసరు..!



65డీప్ బస్తీలో చదును చేసిన ప్రభుత్వ భూమి

బెల్లంపల్లి: రెవెన్యూ డివిజన్ కేంద్రం బెల్లంపల్లిలో భూ ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. నిత్యకృత్యంగా ప్రభుత్వ ఖాళీ భూముల కబ్జాకు తెగబడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆ కోవకే చెందిన మరో ఘటన తాజాగా వెలుగు చూసింది. ఏళ్ల తరబడి నుంచి తుమ్మచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పడావుగా ఉంటున్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి యత్నాలు చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 65డీప్ బస్తీ గురిజాల శివారు సర్వే నెంబర్ 485లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని దురాక్రమణ చేశారు. రెండు రోజుల క్రితం అక్రమార్కులు రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో భూమి చదును చేయించారు. దాదాపు 10ఎకరాల పైబడి ప్రభుత్వ భూమిని దురాక్రమణ చేయడం చర్చనీయాంశమైంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆక్రమణకు పాల్పడిన ప్రభుత్వ భూమి రూ.కోట్లలో విలువ చేస్తుందని స్థానికులు చెబుతున్నారు. కన్నాల శివారు సర్వే నెంబర్ 112లో ఉన్న ప్రభుత్వ, సింగరేణి లీజు భూమిని వారం రోజుల క్రితం ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్న వైనం వెలుగులోకి వచ్చిన నాలుగు రోజుల వ్యవధిలో మరో భూ భాగోతం బెల్లంపల్లిలో బహిర్గతం కావడం భూ ఆక్రమణల పరంపరకు అద్దం పడుతోంది. బెల్లంపల్లి వ్యాప్తంగా ఎక్కడా ఖాళీ భూములు కనిపిస్తే చాలు అక్రమార్కులు కబ్జాకు తెగబడుతుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్వాధీనం చేసుకుంటారా ...!

బెల్లంపల్లిలో ఇప్పటివరకు అనేక చోట్ల ప్రభుత్వ భూముల కబ్జా జరుగుతోంది. కబ్జాల పర్వం ఏ మాత్రం ఆగడం లేదు. పత్రికల్లో వార్తా కథనాలు వచ్చిన ప్రతిసారి అధికార యంత్రాంగం స్పందించడం, ఆ తర్వాత మిన్నకుండి పోవడం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. అక్రమార్కుల చెరలో నుంచి ఒకటి, రెండు చోట్ల మినహా మరెక్కడా అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. తాజాగా ఆక్రమణకు గురైన 65డీప్ బస్తీలోని భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటారా లేక ఇతర చోట్ల మాదిరిగానే వ్యవహరిస్తారా అనేది వేచిచూడాల్సిందే.

బోర్డు ఏర్పాటు చేయిస్తాం

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని సందర్శించి పరిశీలిస్తాం. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం నేరమవుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమణ దారులను ఉపేక్షించం. కబ్జా చేసిన భూభాగంలో ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు మూడు రోజుల్లో ఏర్పాటు చేయిస్తాం. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షిస్తాం.

– కుమారస్వామి, తహసీల్దార్, బెల్లంపల్లి

సాక్షి సినిమాలు



మంచిర్యాల	
శ్రీనివాస	:దసరా
వెంకటేశ్వర	: రుద్రుడు
జెమిని సినిమా స్క్రీన్ 1 :	రుద్రుడు/దసరా
జెమిని సినిమా స్క్రీన్ 2 :	శాకుంతలం/బలగం
లక్సెట్టిపేట	
మహానంద	:రుద్రుడు
జన్నారం	
రాఘవేంద్ర	:రుద్రుడు
చెన్నూర్	
శ్రీశ్రీనివాస	: రుద్రుడు
బెల్లంపల్లి	
రామకృష్ణ	: శాకుంతలం
బాలాజీ	: దసరా
సీసీసీ	
దేవి	: మీటర్
తిరుమల	: రుద్రుడు

– మంచిర్యాలటౌన్

ముస్లింలకు కానుకలు అందజేత



మందమర్రిరూరల్: కానుక అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి



భీమారంలో కానుక పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

మందమర్రిరూరల్: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం రంజాన్ పురస్కరించుకుని ప్రభుత్వం మంజూరు చేసిన తోఫాను పట్టణంలోని ముస్లింలకు జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఓదెలు, జెడ్పీటీసీ వేల్పుల రవి, కో ఆప్షన్ మెంబర్ నసీరొద్దీన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, అబ్బాస్, మద్ది శంకర్, సంపత్, రాంవేణు, తిరుమల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జరీనా, చిప్పకుర్తి రేఖ, సుజాత, శారద తదితరులు ఉన్నారు.

భీమారం: స్థానిక ముస్లింలకు మంజూరైన రంజాన్ తోఫాను గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ తిరుమల, తహసీల్దార్ వాసంతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ బాబర్‌ఖాన్, సర్పంచ్ గద్దెరాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ పర్తిరెడ్డి మహేశ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జైపూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ముస్లింలకు రంజాన్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం అందించిన కానుకలను ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సునిత, వైఎస్ ఎంపీపీ రమేశ్, స్థానిక సర్పంచ్ సువర్ణ, ఎంపీటీసీ లింగస్వామి, మండల కోఆప్షన్ సభ్యులు జైనొద్దీన్‌లు అందజేశారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

ఇఫ్టూ జాతీయ మహాసభల పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: స్థానిక సింగరేణి సివిక్ విభాగం కార్యాలయం ఆవరణలో ఇఫ్టూ ఏడో జాతీయ మహాసభల పోస్టర్లను గురువారం ఆ సంఘం శ్రేణులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జాతీయ మహాసభలు ఈ సారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో ఏప్రిల్ 16–18 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ మహాసభలను కార్మికవర్గం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ శ్రేణులు గణేష్, కుమార్, లింగన్న, వెంకటి, బానుప్రసాద్, పద్మ, సునీత, బుచ్చమ్మ, చంద్రకళ, కరుణ, అమృత, పోశక్క, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



అన్నప్రాసన జరుపుతున్న సూపర్‌వైజర్ రజిత

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పలబొగుడలోని ఆరో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, టీచర్ పెండ్రి స్వప్న, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వీవోఏల నిరసన

మందమర్రిరూరల్: వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద గురువారం స్థానిక వీవోఏలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీవోఏ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుకారం, మండల అధ్యక్షురాలు వనజ, సభ్యులు వెంకటేష్, పావని, లావణ్య, వసంత తదితరులు ఉన్నారు.



నినాదాలు చేస్తున్న వీవోఏలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంబేద్కర్ జీవిత చరిత్రపై నిర్వహించిన పోటీలకు 25మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్‌లు మురళీ, రామరావు, సీనియర్ అసిస్టెంట్ కృతిన్, అటెండర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: అంబేద్కర్ జయంతి సందర్భంగా నెన్నెల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన, కవితల పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ ఏ.స్వరూప తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట సుజాత, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌస్ వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: దివంగత ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ ద్వితీయ వర్ధంతి సభ పోస్టర్లను గురువారం బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తా వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. మహ్మద్‌గౌస్ కమ్యూనిస్టుగా అంచెలంచెలుగా ఎంసీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ఆందోళనలు, పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. గౌస్ ద్వితీయ వర్ధంతిని ఈ నెల 19న వరంగల్ జిల్లా స్వగ్రామం కొత్తూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంసీపీఐ (యూ) శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్, రమేష్, రాధ, స్రవంతి, ఆకాష్, మల్లేష్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక చెక్కు అందజేత



విద్యార్థిని తండ్రికి చెక్కు అందిస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ఆర్కే–1ఏ గనిలో సపోర్ట్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న శంకర్ కుమార్తె సుష్మిత ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ విద్య అభ్యసిస్తోంది. ఈ సందర్భంగా సింగరేణి తరుపున వచ్చిన రూ.10వేల ప్రోత్సాహక చెక్కును ఏరియా జీఎం మోహన్‌రెడ్డి గురువారం శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా పీఎం శ్యాంసుందర్, యూనియన్‌ల ప్రతినిధులు సిబ్బంది ఉన్నారు.

ఫీడర్ క్యాంటీన్ ప్రారంభం

మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గురువారం ఫీడర్ క్యాంటీన్‌ను ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా తీవ్రత వల్ల జీఎం ఆఫీస్ ఆవరణలోని క్యాంటీన్ కొద్ది నెలలు మూసివేయాల్సి వచ్చిందని, నూతన హంగులతో పునఃప్రారంభించినట్లు తెలిపారు. యూనియన్ల ప్రతినిధులు సంపత్, సత్యనారాయణ, పీఎం శ్యాంసుందర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

'ఆత్మీయత లేని సమ్మేళనం'

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో గురువారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో చిన్నచూపుతో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్‌ఖాన్‌ని వేదిక మీదకు పిలవక పోవడంతో అక్కడే నిలబడి ఉండిపోయాడు. దీంతో బీఆర్‌ఎస్ సమ్మేళనంలో ఆత్మీయత లేద ని పలువురు విమర్శలు గుప్పించారు. పాత్రికేయులు గమనించి ఫొటోలు తీయడంతో గుర్తించిన నాయకులు అతనిని స్టేజీ మీదకు పిలిచారు.

చలివేంద్రం ప్రారంభం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మహిళా తరంగిణి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ, మమత గౌరవ అధ్యక్షురాలు గోనె ఇందిరాదేవి, అధ్యక్షురాలు శ్రీదేవిగౌడ్, కార్యదర్శి కె.పద్మారెడ్డి, కోశాధికారి జ్యోత్స్న చంద్రదత్, సలహాదారులు చిదానంద కుమారి, గోనె భాగ్యలక్ష్మి, సభ్యులు నాగమణి, ఆర్.భాగ్యలక్ష్మి, వనజ, వనిత, లీల, చంద్రకళ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'బీసీల రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రయత్నించాలి'

జన్నారం: చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించి, తాను చేసిన పాపాలను కడిగేసుకోవాలని బీసీ సంఘాల పోరాట సమితి కన్వీనర్ చంద్రయ్య, కో కన్వీనర్లు కాసెట్టి లక్ష్మణ్ గురువారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. బీసీ సంఘాల పోరాట సమితి నాయకులు గంగాధర్, కడార్ల నర్సయ్య, భాస్కర్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్‌లో 'బలగం' ప్రదర్శన

జైపూర్: జైపూర్ మండల హైస్కూల్‌లో సర్పంచ్ అసంపల్లి సువర్ణ రాజమల్లు, ఎంపీటీసీ రాంటెంకి లింగస్వామి ఆధ్వర్యంలో గురువారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయులకు అనుబంధంగా తెరకెక్కించిన బలగం సినిమాను ప్రజలకు చూపించారు. కుటుంబ బంధాల విలువలను చూసి కంటతడి పెట్టుకున్నారు.